
# యువశక్తి కదం తొక్కాలి..
# బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

- అత్యధిక ఉద్యోగాలు ఇచ్చింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే
- జాబ్‌లపై మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు
- కేసీఆర్‌ను ఓడించాలంటే.. మరో కేసీఆర్ పుట్టాలి
- సుదర్శన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి సొంత ఊళ్లనూ అభివృద్ధిచేసింది మేమే..
- షకీల్‌ను 50 వేల మెజార్టీతో గెలిపించాలి
- బోధన్ మహా యువగర్జన సభలో ఎమ్మెల్సీ కవిత పిలుపు


మహా యువగర్జనలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, వేదికపై ఎమ్మెల్యే షకీల్, ఆయన సతీమణి ఆయేషా

బోధన్, నవంబర్ 2: తెలంగాణ ఉద్యమంలో యువత ముందు నడిచిందని, ఎత్తిన పిడికిలి దించకుండా ఉద్యమించారని, అదే స్ఫూర్తితో ప్రస్తుత ఎన్నికల్లోనూ కదం తొక్కి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. బోధన్ పట్టణంలోని ఎన్‌ఎస్‌ఎఫ్ గ్రౌండ్‌లో గురువారం బీఆర్‌ఎస్ అభ్యర్థి, బోధన్ ఎమ్మెల్యే షకీల్, ఆయన సతీమణి ఆయేషా ఫాతిమా ఆధ్వర్యంలో నిర్వహించిన 'మహా యువగర్జన సభ'కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాకేంటని ఎవరికివారు అనుకుంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చేది కాదని, తెలంగాణ కూడా వచ్చేది కాదన్నారు. ఈ క్రమంలో ఎన్నికలు వచ్చాయి కాబట్టి, తెలంగాణ తెచ్చిన బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత యువకులపై ఉందని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రతి గుండెనూ తట్టి ఓట్లు వేయించాలని, షకీల్‌ను 50 వేల భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. యువగర్జనకు తరలివచ్చిన వేలాది మంది యువత ఉత్సాహం చూస్తుంటే.. బోధన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి, ప్రజలకు సేవ చేస్తున్న షకీల్ గెలుపు ఖాయమైందన్నారు. ఇది ఎన్నికల తర్వాత జరుపుకొనే విజయోత్సవ సభలా కనిపిస్తున్నదని అన్నారు. కేసీఆర్ పథకాలు చేరని ఇల్లంటూ లేదని, ప్రతి ఇంటి నుంచి ఓట్లు వేయించాలని సూచించారు.


మహా యువగర్జనకు హాజరైన ప్రజలు

**సుదర్శన్‌రెడ్డి గెలిస్తే పొద్దుగూకుడే..**

బోధన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి గెలిస్తే ఇక పొద్దు పొడుసుడు ఉండదని, కేవలం పొద్దుగూకుడే అని కవిత ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ హయాంలో నీళ్ల మంత్రిగా పనిచేసిన సుదర్శన్‌రెడ్డి.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ధనయజ్ఞానికి సహకరించారే తప్ప.. బోధన్ ప్రాంతానికి చుక్కనీరు కూడా తేలేదని విమర్శించారు. ఆయన సొంత గ్రామం సిర్నాపల్లి చెరువుకు షకీల్ రూ.53 లక్షలతో మరమ్మతు చేయించారన్నారు. అలాగే, బీజేపీ అభ్యర్థి మోహన్‌రెడ్డి స్వగ్రామం మోకన్‌పల్లిలో చెరువులను సైతం షకీలే బాగుచేయించారన్నారు. మోకన్‌పల్లి ప్రాంతానికి సీఎం కేసీఆర్ రూ.17 కోట్ల నిధులు ఇచ్చారని, సుదర్శన్‌రెడ్డి గ్రామానికి రూ.7 కోట్లు ఖర్చుపెట్టారని లెక్క చెప్పారు.


షకీల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్న ఎమ్మెల్సీ కవిత

## కవిత నాయకత్వంలో అన్ని సీట్లు మావే: షకీల్

'ప్రజా నాయకురాలంటే కవితక్కలా ఉండాలి.. ఆమె రుద్రమదేవి.. కవితక్క నాయకత్వంలో బోధన్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధిచెందింది' అని యువగర్జన సభలో బోధన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అన్నారు. కవిత నాయకత్వంలో జిల్లాలోని అన్ని అసెంబ్లీ సీట్లు గెలుచుకుంటామని చెప్పారు. ఆమె పెద్ద ఎత్తున నిధులు మంజూరుచేయించారని, దీంతో బోధన్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. యువగర్జనలో జడ్పీ వైస్ చైర్మన్ రజితా యాదవ్, బోధన్ ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్, మున్సిపల్ వైస్ చైర్మన్ సోహైల్, బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్ యాదవ్, బుద్దె రాజేశ్వర్, గోగినేని నర్సయ్య, భవానీపేట్ శ్రీనివాస్, దేవ, హరికృష్ణ, ప్రవీణ్ నాయక్, అడ్లూరి నరేశ్, జుబేర్, భరత్‌యాదవ్, సిరివేణు సంతోష్, రవిశంకర్‌గౌడ్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అత్యధిక ఉద్యోగాలు ఇచ్చింది మేమే..



చరిత్రలో ఎన్నడూలేని విధంగా నిరుద్యోగ యువతకు అత్యధిక ఉద్యోగాలను ఇచ్చింది సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని కవిత స్పష్టం చేశారు. ఉద్యోగాల కల్పనపై కాంగ్రెస్‌కు, రేవంత్‌రెడ్డికి మాట్లాడే అర్హత లేదని అన్నారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో మొత్తం కలిపి కేవలం 24వేల ఉద్యోగాలే కల్పించారని, అందులో తెలంగాణకు వచ్చిన ఉద్యోగాలు కేవలం 10 వేలు మాత్రమేనన్నారు. కాంగ్రెస్ పాలనలో ఉద్యోగాల పరిస్థితి ఇలా ఉంటే.. సీఎం కేసీఆర్ 2.32 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు నోటిఫికేషన్లు జారీ చేశారని, ఇందులో 1.60 లక్షల ఉద్యోగాలు భర్తీచేసుకోగా, భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నదని తెలిపారు. కేసీఆర్‌ను ఓడించడం ప్రతిపక్షాలకు సాధ్యంకాదని, ఆయనను ఓడించాలంటే మళ్లీ కేసీఆరే పుట్టాలని కవిత అన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలతో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు.

# నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రత్యేక ఖాతా నుంచే ఖర్చు చేయాలి
- నిజామాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 2 : రాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణకు శుక్రవారం నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నామినేషన్లకు సంబంధించిన పలు సూచనలు చేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటనను విడుదల చేశారు. 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 13న నామినేషన్ల పరిశీలన, 15న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, ఈనెల 30న పోలింగ్, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు. ఎన్నికల్లో పోటీ చేయదలచిన వారు నామినేషన్లను ఈనెల 3 నుంచి 10వ తేదీలోగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆయా నియోజకవర్గాల్లోని రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని సూచించారు.

జిల్లాలోని ఆరు నియోజకవర్గాలో రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరిస్తారని తెలిపారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ నామినేషన్లను నగరపాలక సంస్థ కార్యాలయంలో మకరంద్, రూరల్ నామినేషన్లను ఆర్డీవో కార్యాలయంలో రాజేంద్రకుమార్, బోధన్ నియోజకవర్గ నామినేషన్లను బోధన్ ఆర్డీవో కార్యాలయంలో రాజాగౌడ్ స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గ నామినేషన్లను బాన్సువాడ ఆర్డీవో కార్యాలయంలో భుజంగరావు, ఆర్మూర్ నియోజకవర్గానికి సంబంధించి ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయంలో వినోద్‌కుమార్, బాల్కొండ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్లను భీమ్‌గల్ ఎంపీడీవో కార్యాలయంలో చిత్రామిశ్రా స్వీకరిస్తారని వివరించారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని పేర్కొన్నారు. నామినేషన్ పత్రాలు నింపడంలో సూచనలు, సలహాలు ఇవ్వడానికి ప్రతికేంద్రంలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు భారతీయ పౌరులై, 25 సంవత్సరాలు నిండి ఉండాలని తెలిపారు. నామినేషన్ పత్రంలోని ప్రతి కాలం తప్పనిసరిగా నింపాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఫారం-2బీలో నామినేషన్ పత్రం సమర్పించాలని, జనరల్ అభ్యర్థులైతే రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలు అయితే రూ. 5 వేల డిపాజిట్ నగదు రూపంలో లేదా చలాన్ రూపంలో చెల్లించాలని సూచించారు. నామినేషన్ పత్రంతో పాటు 10 రూపాయల నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్‌పై ఫారం-26 అఫిడవిట్ సమర్పించాలని, క్రిమినల్ కేసులుంటే వాటికి సంబంధించిన వివరాలను పొందుపర్చాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రమాణ పత్రాన్ని అందజేయాలని తెలిపారు. నామినేషన్ రోజు నుంచే అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరిచి, ఆ ఖాతా నుంచే ఎన్నికల ఖర్చు నిర్వహించాలని, ఖర్చు వివరాలను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని సూచించారు.

# కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణకు కంట్రోల్ రూం ఏర్పాటు


కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 2 : వానకాలం 2023-24 సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించేందుకు వీలుగా జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. నగరంలోని కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూంను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు.. అదనపు కలెక్టర్ యాదిరెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం సేకరణ కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వపరంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 421 కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చామని, మరికొన్ని చోట్ల కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలకు సంబంధించి ఏవైనా ఇబ్బందులుంటే రైతులు కంట్రోల్ రూమ్ 08462-293087, 8142200200, 9908276004 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు, సలహాలు, సూచనలు అందించవచ్చని సూచించారు. కార్యక్రమంలో డీసీవో సింహాచలం, డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ జగదీశ్ పాల్గొన్నారు.